ప్రజాశక్తి
శుక్రవారం 29 డిసెంబర్ 2023
5
విజయనగరం

ఓపెన్ టెన్త్‌కు 19లోగా ఫీజు చెల్లించాలి

ప్రజాశక్తి-విజయనగరం

సార్వత్రిక విద్యాపీఠం పదోతరగతి, ఇంటర్‌కు జనవరి 5 నుంచి 19వ తేదీలోగా అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించవచ్చునని డిఇఒ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. 2023-24 వ విద్యా సంవత్సరానికి సార్వత్రిక టెన్త్, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు (థియరీ) మార్చి 18 నుంచి 27 వరకు మధ్యాహ్నం 2:30గంటల నుంచి సాయంత్రం 5:30గంటలు వరకు జరుగుతాయని తెలిపారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు మార్చి 30 నుంచి ఏప్రిల్ 3 వరకు జరుగుతాయన్నారు. సబ్జెక్టుకు రూ.25 అపరాధ రుసుముతో జనవరి 20 నుంచి 27వరకు, రూ.50 అపరాధ రుసుముతో ఫిబ్రవరి 3వరకు, తత్కాల్ టెన్త్‌కు రూ.500, ఇంటర్‌కు రూ.వెయ్యి ఫిబ్రవరి 9 వరకు చెల్లించవచ్చునని తెలిపారు.

డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి

డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగుల ర్యాలీ, మానవహారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్‌చేస్తూ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో గురువారం కోట జంక్షన్ వద్ద నుండి కన్యకా పరమేశ్వరి కోవేల వరకు నిరుద్యోగులు ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ మానవహారం చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ హరీష్ మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి మన ప్రభుత్వం వచ్చిన వెంటనే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నింటికీ నోటిఫికేషన్లు విడుదల చేస్తానని, అలాగే ప్రతిఏటా ఖాళీ అయ్యే ఉద్యోగాలతో కలిపి జనవరిలో జాబ్ క్యాలెండర్లు విడుదల చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. 2018 డిఎస్‌సి తర్వాత ఇప్పటివరకు ఒక్క డిఎస్‌సి కూడా విడుదల చేయకుండా నిరుద్యోగుల పొట్ట కొట్టారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పేరుతో పనులు చేసి భారీగా విద్యార్థుల సంఖ్యను పెంచామని గొప్పలు చెప్పుకునే జగన్మోహన్ రెడ్డికి ఆ విద్యార్థులకు చదువు చెప్పడానికి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని ఆలోచన లేకపోవడం అన్యాయమని అన్నారు. పార్లమెంటులో కేంద్ర విద్యా శాఖ మంత్రి మాట్లాడుతూ 50వేల టీచర్‌పోస్టులు రాష్ట్రంలో ఖాళీగా ఉన్నాయని ప్రకటిస్తే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పొంతనలేని విధంగా రోజుకో మాట ఆడుతున్నారని అన్నారు. బిఇడి, టిటిసి చదువుకొని రాష్ట్రంలో పది లక్షల మంది పైబడి కోచింగ్ సెంటర్లు, స్టడీ హాల్స్‌లో మగ్గిపోతున్నారని వీరి బాధలు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టవా అని ప్రశ్నించారు. తక్షణమే 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని లేనిపక్షంలో జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాల్సి వస్తుందని హెచ్చరించారు. ర్యాలీలో డివైఎఫ్‌ఐ ఉపాధ్యక్షులు సతీష్, డిఎస్‌సి అభ్యర్థులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయ జంక్షన్‌లో రాస్తారోకో చేస్తున్న నిరుద్యోగులు

రాజాం ఎమ్మెల్యేకు సీటు లేనట్టేనా?

- సిఎం జగన్‌తో భేటీ అయిన కంబాల జోగులు
- కొత్త అభ్యర్థి కోసం వెతుకులాట

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాజాంలో అసెంబ్లీ స్థానంలో సిట్టింగ్ ఎమ్మెల్యే కంబాల జోగులకు వచ్చే ఎన్నికల్లో అవకాశం సీటు లేనట్టేనని రాజకీయ నాయకుల్లో చర్చ నడుస్తోంది. ఆ స్థానంలో బరిలోకి దింపేందుకు అభ్యర్థికోసం వైసిపి వెతుకులాట ప్రారంభించిందన్న ప్రచారం కూడా ముమ్మరంగా సాగుతోంది. అభ్యర్థుల మార్పులు చేర్పులు, విషయమై వైసిపి అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎమ్మెల్యేలను పిలిపించి మాట్లాడుతున్న విషయం విధితమే. అందులో భాగంగా ఎమ్మెల్యే జోగులకు పిలుపు

రావడంతో ఆయన బుధవారం సిఎంను కలిశారు. ఎన్నికల్లో అభ్యర్థుల మార్పులు, చేర్పులు సహజమని, సీటు ఎవరికి ఇచ్చినా కలిసికట్టుగా పనిచేయాలని జోగులకు సిఎం సూచన చేసినట్టుగా తెలుస్తోంది. తిరిగి అధికారంలోకి వస్తే పార్టీకోసం కష్టపడిన వారందరికీ తగిన గుర్తింపు ఉంటుందని కూడా భరోసా ఇచ్చినట్టు సమాచారం. స్థానిక సమస్యలను పరిష్కరించ లేకపోవడం మొదలుకుని, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోవడం తదితర కారణాల వల్ల జోగులపై ప్రజల్లో విశ్వాసం తగ్గిందన్నది వైసిపి చేపట్టిన సర్వేల్లో వెల్లడైనట్టుగా చర్చ నడుస్తోంది. ఆయన మెతక వైఖరి కూడా ప్రత్యర్థులకు లాభదాయకంగా ఉంటుందని భావిస్తున్నారు. దీనికితోడు అక్కడి టిడిపి నుంచి బరిలోకి దిగబోయే అభ్యర్థి కూడా కాస్త బలమైన నాయకుడు కావడంతో వైసిపి అధిష్టానం ఆచుతూచి వ్యవహరిస్తోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అందులో భాగంగానే రాజాంలో సేవలందిస్తున్న ఒకరిద్దరి వైద్యుల పేర్లను పార్టీ పరిశీలిస్తుందట. వీరికన్నా కాస్త పలుకుబడి, అర్థబలం ఉన్న వారి కోసం కూడా అన్వేషణ జరుగుతోందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. సీటు దక్కకపోవడం అనివార్యమైతే జోగులు పార్టీని వీడే సాసహం చేస్తారా? లేక పార్టీలోనే కొనసాగుతారా? అన్నది త్వరలోనే బయటపడే అవకాశాలు ఉంటాయని రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు.

రూ.5.81 కోట్లతో అభివృద్ధి పనులు

ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి-భోగాపురం, నెల్లిమర్ల

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి బూడి ముత్యాలనాయుడు నెల్లిమర్ల నియోజకవర్గంలో రూ.5.81 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్‌లతో కలిసి గురువారం ప్రారంభించారు. ముందుగా భోగాపురంలోని సుందరపేట వద్ద రూ.3.95 కోట్ల నాబార్డు ఆర్థిక సాయంతో నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనాన్ని ప్రారంభించారు. నెల్లిమర్ల మండలం రామతీర్ధంలోని శ్రీరామస్వామి ఆలయం వద్ద రూ.75 లక్షల కామన్ గుడ్ ఫండ్ నిధులతో చేపట్టిన భాస్కర పుష్కరిణి అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. తొలుత శ్రీరామస్వామి వారి ఆలయాన్ని మంత్రితో పాటు ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు దర్శించుకున్నారు.

అనంతరం జరజాపుపేటలో రూ.1.11 కోట్ల వ్యయంతో నిర్మించిన పట్టణ ఆరోగ్యకేంద్రం భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంఎల్‌సి పెనుమత్స సురేష్‌బాబు, డిఎంహెచ్‌ఒ డాక్టర్ భాస్కరరావు, డిసిహెచ్‌ఎస్ గౌరీశంకర్, వైద్య ఆరోగ్య మౌళిక సదుపాయాల సంస్థ ఇఇ సత్యప్రభాకర్, రామస్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, భోగాపురంలో మండల వైసిపి అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, పడాల శ్రీనివాసరావు, భాను, సుందర హరీష్, వైద్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

1 నుంచి పింఛన్ల పండుగ

విజయనగరం : జనవరి 1 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్ల పండగ జరుగుతుందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్రపంచాయతీరాజ్‌శాఖా మంత్రి బూడి ముత్యాలునాయుడు అన్నారు. పింఛన్ల పెంపు, వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ చేయూత పథకాల అమలుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి వివిధ జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బూడి ముత్యాలనాయుడు మీడియాతో మాట్లాడారు. పింఛను జనవరి నుంచి రూ.3వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వైఎస్ఆర్ ఆసరా వారోత్సవాలను జనవరి 23 నుంచి 31 వరకు నిర్వహిస్తామన్నారు. చేయూత పథకం నాలుగో విడత ఫిబ్రవరి 5 నుంచి 14 అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఫిబ్రవరి 15, 16 తేదీల్లో సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులను ఇచ్చి వలంటీర్లను సన్మానిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎంఎల్‌సి డాక్టర్ పి.సురేష్‌బాబు, ఎంఎల్‌ఏలు శంబంగి వెంకట చినప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్య, బడ్డుకొండ అప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, డిఆర్‌డిఏ పిడి ఎ.కల్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థం కోనేరు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి

సమగ్ర శిక్ష ఉద్యోగుల వంటావార్పు

మెమోలు వెనక్కి తీసుకోవాలి : జెఎసి రాష్ట్ర అధ్యక్షులు కాంతారావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేపట్టిన సమగ్ర శిక్ష ఉద్యోగులు గురువారం కలెక్టరేట్ వద్ద వంటా వార్పుతో నిరసన తెలిపారు. ఖాళీ ప్లేట్లు పట్టుకొని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బి. కాంతారావు, జిల్లా జెఎసి అధ్యక్షులు గురువులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతుంటే కెజిబివి ఉద్యోగులకు మెమోలు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. బెదిరింపులకు భయపడేది లేదని, సమస్యలు పరిష్కారం చేసే వరకు సమ్మె విరమించేది లేదని అన్నారు. సమగ్ర శిక్షా అభియాన్లో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేసి, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కల్పించాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవులుమంజూరు చేయాలని, గ్రాడ్యుటీ, 20లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీరి సిఐటియు నాయకులు టివి రమణ, ఎపి అంగనవాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు మద్దతు తెలిపారు.

ఖాళీ ప్లేట్లతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఎస్‌టి కమిషన్ ఛైర్మన్‌కు వినతులు

ప్రజాశక్తి-విజయనగరం

ఎపి టిడబ్ల్యు ఆర్ మినీ గురుకులంలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని గురువారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డి.వి.జి శంకర రావుకు వినతినిచ్చారు. మినీ గురుకులాలు ప్రారంభించబడి నుంచి పనిచేస్తున్న తమకు జీతాలు పెరగలేదని, మినిమం టైం స్కేల్ విధానం ఉద్యోగులుకు వర్తింపజేసేలా చూడాలని కోరారు.

జిసిసిల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగులు వినతి పత్రం అందజేశారు. గత 30 సంవత్సారాలుగా విధులు నిర్వహిస్తున్నా ప్రమోషన్స్ లేవని, రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేసి వారికి పదోన్నతి కల్పించాలి కోరారు. ఛైర్మన్ స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు

జూనియర్ డాక్టర్ల ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్టయిఫండ్ బకాయిలు చెల్లించాలని పోరుబాట పట్టిన సర్వజన ఆస్పత్రి జూనియర్ డాక్టర్లు గురువారం నగరంలో ర్యాలీ నిర్వహించారు.సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, జీతం లేనిదే జీవితం లేదంటూ నినాదాలు చేశారు.సర్వజన ఆస్పత్రినుంచి కాంప్లెక్సు వరకు అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ఎన్ఎంజి ప్రకారం తాము విధులు నిర్వహిస్తున్నప్పటికీ వారు చెప్పిన విధంగా తమకు స్టయిఫండ్ రావడం లేదని తెలిపారు. ఇప్పటివరకు ఏడు నెలలు బకాయి ఉందన్నారు. వెంటనే ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న విఆర్‌ఎలు

కలెక్టరేట్ వద్ద విఆర్‌ఎల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విఆర్‌ఎలకు పే స్కేల్, డిఎ బకాయిల చెల్లింపులతో పాటు బిఎల్‌ఒ డ్యూటీల మినహా యింపు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు గురుమూర్తి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కలెక్టరేట్ ఎదుట విఆర్‌ఎల సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విఆర్‌ఎలకు సంబంధం లేని పనులు చేయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శ్రమ దోపిడీ చేస్తుందన్నారు. కేవలం రూ.10,500 వేతనంతో బతకలేక ఇబ్బందులు పడతున్నారని తెలిపారు. పోరాడి సాధించుకున్న డిఎ ను జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఒకేసారి వేలాది రూపాయలు తిరిగి రికవరీ చేయడం దుర్మార్గమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విఆర్‌ఎలకు పే స్కేల్ అమలు చేస్తుంటే మన రాష్ట్రంలో ప్రభుత్వం నిమ్మకు నీరు ఎత్తినట్టు వ్యవహరిస్తోందన్నారు. ఇటువంటి ద్రోహం చేసే పద్ధతులను వెంటనే విడనాడి విఆర్‌ఎల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఆ సంఘం కార్యదర్శి జి.వెంకన్న, విఆర్‌ఎలు పాల్గొన్నారు.

ఉరితాళ్లతో అంగన్వాడీల నిరసన

- గాంధీ విగ్రహం ఎదుట పొర్లు దండాలు
- చీపురుపల్లిలో ర్యాలీ
- ఎస్.కోటలో పోస్టు కార్డు ఉద్యమం

ప్రజాశక్తి-గజపతినగరం

సమస్యల పరిష్కారానికి చేపట్టిన అంగన్వాడీ కార్యకర్తల సమ్మె ఉవ్వెత్తున సాగుతోంది. 17వ రోజు సమ్మెలో భాగంగా గురువారం పలు పాదయాత్ర సందర్భంగా వేతనాలు పెంచుతామని ప్రకటించిన జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఉరితాళ్లు బిగిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేల ఇల్లు ముట్టడి సందర్భంగా గుండెపోటుతో మృతి చెందిన నెల్లూరు జిల్లా తరుణవాయి గ్రామానికి చెందిన వనమ్మ మృతికి అంగన్‌వాడీలంతా సమ్మె శిబిరాల్లో నివాళు లర్పించారు.

సమస్యలు పరిష్కరించకుండా చర్చల పేరుతో కాలయాపన చేస్తున్న ప్రభుత్వ తీరును నిరసిస్తూ గజపతినగరంలో అంగన్‌వాడీలు యూనిఫాం చీరలతో మెడకు బిగించుకొని నిరసన తెలిపారు. ప్రభుత్వం దిగివచ్చి పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం గ్రాడ్యుటి ఇవ్వాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్‌జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి, ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.సుభాషిణి, పి.జ్యోతి, డి.నాగమణి, రవణమ్మ, సన్యాసమ్మ, రాములమ్మ, నారాయణమ్మ, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ఆర్. హరికష్ణ వేణి పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం ఎదుట పొర్లు దండాలు

జామి : గాంధీ విగ్రహానికి అంగన్‌వాడీలు వినతి పత్రాలు అందిస్తూ, అక్కడే పొర్లు దండాలు చేశారు. సమ్మె శిబిరంలో కోలాటంతో హోరెత్తించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ...రాష్ట్రం ఉద్యమాల ఆంధ్రగా మారిపోతుందని, ఇప్పటికైనా జగన్ ప్రభుత్వం కళ్లు తెరవాలని హితవు పలికారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు గాడి అప్పారావు, వెంకటలక్ష్మి, విష్ణుమ్మ, రామలక్ష్మి, కనకమహాలక్ష్మి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి : పట్టణంలో అంగన్‌వాడీలు భారీ ర్యాలీ నిర్వహించారు. తహశీల్దారు కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ లావేరు రోడ్డు, మూడు రోడ్లు కూడలి, మెయిన్ రోడ్డు మీదుగా గాంధీ బొమ్మ జంక్షన్ వరకు సాగింది. అక్కడ గాంధీ విగ్రహానికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం సిటియు జిల్లా నాయకులు అంబళ్ల గౌరినాయుడు మాట్లాడుతూ అంగన్‌వాడీలు పట్ల ప్రభుత్వ మొండి వైఖరి తగదన్నారు. కార్యక్రమంలో చీపురుపల్లి అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్షులు బలగ నాగమణి, అంగన్‌వాడీ వర్కర్స్ మరియు హెల్పర్స్ పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె శిబిరంలో మెడకు ఉరి తాళ్లక బిగించుకొని అంగన్వాడీ లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యునియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు మాట్లాడుతూ 17 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు టివి రమణ, అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

ఎస్.కోటలో సిఎంకు పోస్టుకార్డులు పంపుతూ ..

కొత్తవలస : తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. సిఐటియు నాయకులు గాడి అప్పారావు, ప్రాజెక్ట్ నాయకులు కాకర తులసి, శంకరావతి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : సమ్మె శిబిరంలో మౌనం పాటించి నిరసన తెలిపారు. అనంతరం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కామేశ్వరి, ఉమాగౌరి, ప్రసన్నలక్ష్మి, నిర్మల, పద్మ మాట్లాడారు.

గజపతినగరంలో ఉరితాళ్లతో నిరసన

శృంగవరపుకోట : సమ్మె శిబిరం వద్ద నుంచి గాంధీ విగ్రహం వరకు అంగన్వాడీలు ర్యాలీగా వెళ్లి గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు, అక్కడి నుంచి గ్రామపంచాయతీ మీదుగా పోస్టాఫీసు వరకు ర్యాలీ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రికి పోస్టుకార్డులు పంపించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, చెలికాని ముత్యాలు, యూనియన్ ప్రాజెక్టు లీడర్ డి.శ్యామల, డి. జయలక్ష్మి, వి.మాణిక్యం, కె.సుశీల తదితరులు పాల్గొన్నారు.

పోరాట పటిమ నింపిన 'ప్రజాశక్తి'

రేగిడి : రాజాం నియోజకవర్గంలో రేగిడి, సంతకవిటి ,వంగర, రాజాం మండలాల అంగన్వాడీ కార్యకర్తలు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి ముద్రించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. సిఐటియు నాయకులు సిహెచ్ రామ్మూర్తి నాయుడు మాట్లాడుతూప్రజాశక్తి ప్రత్యేక సంచిక అంగన్వాడీల్లో పోరాట పటిమను నింపిందని అన్నారు. టిడిపి ఇన్‌ఛార్జి కోండ్రు మురళీ అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో రేగిడి మాజీ జెడ్‌పిటిసి, మంతిన ఉషారాణి, జగన్మోహన్‌రావు, గురవాన నారాయణరావు పాల్గొన్నారు.

బాడంగి : అంగన్‌వాడీలంతా మెడకు ఉరితాళ్లు వేసుకొని నిరసన తెలిపారు. సిఐటియు నాయకులు , అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

విజయనగరంలో మెడకు ఉరితాళ్లు వేసుకొని నిరసన

రాజాంలో ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడీలు

జామిలో గాంధీ విగ్రహం వద్ద పొర్లు దండాలు పెడుతున్నఅంగన్‌వాడీలు

ప్రజాశక్తి
www.prajasakti.com
విజయనగరం

భవన నిర్మాణ కార్మికుల ధర్నా

విజయనగరం టౌన్: భవన నిర్మాణ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యాన ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి. రమణ మాట్లాడుతూ సంక్షేమ బోర్డు నిధుల ద్వారా భవన నిర్మాణ కార్మికల సంక్షేమం కొసం గతంలో ఉన్న పథకాలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగి వికలాంగులైతే రూ.2లక్షలు, మరణిస్తే రూ.5 లక్షలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇసుక, ఇనుము, ఇతర భవన నిర్మాణ వస్తువులు ధరలూ తగ్గించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఆ సంఘం నాయకులు కంది త్రినాధరావు, విశ్వనాధం, త్రినాధ్ రమేష్, ఎర్రిబాబు, సతీష్ పాల్గొన్నారు. ధర్నాకు ఐద్వా నాయకులు పి.రమణమ్మ, వి.లక్ష్మి మద్దతు తెలిపారు.

టిడిపిలో భారీగా చేరికలు

విజయనగరంకోట: విజయనగరం నియోజకవర్గానికి చెందిన పలువురు టిడిపిలో చేరారు. గురువారం అశోక్ బంగ్లా టిడిపి కార్యాలయంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు, జిల్లా బిసి సంఘం అధ్యక్షులు గదుల వెంకటరావు ఆధ్వర్యంలో 300కుటుంబాలు, 26వ డివిజన్ నాయకులు ముక్కాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 50కుటుం బాలు, కార్యకర్తలతో పాటుగా, విజయనగరం నియోజకవర్గ బిసి సంఘ నాయకులు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు వీరికి పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి అతిథి గజపతిరాజు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిం చారు. ఈ సందర్భంగా అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు.

బేబినాయన ఆర్థిక సహాయం

తెర్లాం: మండలంలోని అంట్లవార గ్రామంలో బుధవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి చెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు గురువారం ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన మృతి చెందిన వారి రెండు కుటుంబాలకు రూ.20 వేలు చొప్పున, గాయపడిన ఐదుగురికి రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. వీటిని మాజీ ఎమ్మెల్యే చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకటనాయుడు, నర్సుపల్లి వెంకటేష్, శంకర్రావు పాల్గొన్నారు.

విజేతలకు ఎమ్మెల్సీ అభినందనలు

శృంగవరపుకోట: ఈ నెల 24, 25 తేదీలలో ప్రకాశం జిల్లా రామయ్యపట్నంలో జరిగిన 43వ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీలలో జిల్లాకు చెందిన 13 మంది మాస్టర్ అథ్లెట్స్ పాల్గొని తమ సత్తా చాటారు. వీరు 21 బంగారు, 15 రజిత, 6 కాంస్యం, మొత్తం 42 పతకాలు సాధించి విజయ పతాకం ఎగురవేశారు. ఈ సందర్భంగా జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్ సంఘం అధ్యక్షులు అండ్ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మండలంలోని బొడ్డవారిలో తన నివాసంలో క్రీడాకారులను గురువారం అభినందించారు. రాబోయే కాలంలో జాతీయ, అంతర్జాతీయ వేదికలలో జరిగే పోటీలలో పాల్గొని మరిన్ని పతకాలు సాధించి మన జిల్లాకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్ సంఘం కార్యదర్శి మలిరెడ్డి కృష్ణ, సీనియర్ క్రీడాకారులు ఆల్తి త్రినాధరావు, మజ్జి శంకర్రావు, షటిల్ బ్యాట్మెంటన్ చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డిపిటిఒ

విజయనగరం కోట : విజయనగరం ఆర్‌టిసి డిపో పరిసర ప్రాంతాల ప్రయాణికుల కోసం శుక్రవారం డయల్ యువర్ డిపిటిఒ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్ అప్పలనారాయణ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జిల్లా పరిధిలో గల ప్రయాణికులంతా ఎటువంటి సమస్యలున్నా ఫోన్ నెంబరు 9959225604కు తెలిపి నివృత్తి చేసుకోవాలని ఆయన కోరారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

విజయనగరం టౌన్: నగరంలోని రామారావుపేట రోడ్డు నిర్మాణ పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి గురువారం శంకుస్థాపన చేశారు. కుమ్మరి విగ్రహం నుండి ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ వరకు ఉన్న రహదారిని నూతనంగా నిర్మించనున్నారు. కోటి 70 లక్షల నిధులతో రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కాపుగంటి ప్రకాష్, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, కమిషనర్ ఆర్.శ్రీరాములు నాయుడు, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు,నగర కార్పొరేషన్ డైరెక్టర్ రుక్మిణి పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యం వెలికితీయడానికే..

పూసపాటిరేగ : క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని బయటకు తీయడానికే ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవం జరుపుతుందని ప్రభుత్వమని ఎంపిపి మహంతి కళ్యాణి తెలిపారు. గురువారం మండలంలోని కుమిలి, కందివలస, వెంపడాం గ్రామాల్లో ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని ఆడుదాం ఆంధ్రా ప్రత్యేకతను వివరించారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కుమారుడు ప్రదీప్ క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రోత్సహించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, మండల జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనువాసరావు, వైస్ ఎంపిపి చందిరాజు, జెసిఎస్ కన్వీనర్ మహంతి జనార్ధనరావు, గుజ్జు సురేష్‌రెడ్డి, సర్పంచులు దేశెట్టి గణేష్, పిన్నింటి కుమార్, ఎంపిడిఒ రాధిక తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: నగర పంచాయతీలోని తాన్స్ కుమార్ జూనియర్ కళాశాల మైదానంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను గురువారం కమిషనర్ బాలాజీ ప్రసాద్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువతీ యువకులలో క్రీడ ప్రతిభను వెలికి తీయడానికి ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు కౌన్సిలర్లు, పిఇటిలు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విహారయాత్రలో విషాదం

కొత్తవలస: కొత్తవలస – అరకు ప్రధాన రహదారిలో నిమ్మలపాలెం గ్రామం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విశాఖపట్నం జిల్లా, మింది గ్రామానికి చెందిన తేజ (23) మృతి చెందాడు. స్నేహితులతో కలిసి అరకు విహారయాత్రను ముగించుకొని తిరిగి వస్తుండగా నిమ్మలపాలెం గ్రామం వద్ద ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను బలంగా ఢీకొన్నాడు. దీంతో సంఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. అతనితోపాటు ప్రయాణం చేస్తున్న మరొక యువకుడు భాను తీవ్రంగా గాయపడటంతో 108 అంబులెన్స్‌లో పోలీసులు హాస్పిటల్‌కు తరలించారు. మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణంగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తూ జారిపడి వ్యక్తి మృతి

రామభద్రపురం: విజయనగరం గాజుల రేగకు చెందిన బెల్లాన పైడిరాజు (58) ప్రమాదవ శాత్తూ బిల్డింగ్ మూడో అంతస్తు నుంచి జారిపడి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు.. మృతుడు బిల్డింగ్ పనుల కోసం మండల పరిధిలో కొత్తపుట్టి వచ్చి అక్కడ పనులు చేస్తున్నారు. ఎప్పటిలాగానే గురువారం మూడో అంతస్తులో పనులు చేస్తూ ప్రమాద వశాత్తూ జారి కింద పడ్డారు. వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. అతని భార్య కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి గ్రామానికి చెందిన వ్యక్తి ఉంగరాడ మెట్ట నుంచి ఎనిమిది మద్యం బాటిల్ తరలిస్తుండగా గురువారం పట్టుబడినట్లు ఎస్ఐ ఆర్ శ్రీనివాసరావు తెలిపారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్టు తెలిపారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహణకు అడ్డుకట్ట వేస్తున్నామని ఎవరైనా అక్రమంగా మద్యం తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు కానిస్టేబుల్ శివ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు వెలవెల

● పది శాతం కేంద్రాలను తెరిచిన అధికారులు ● అయినా కేంద్రాలకు రాని చిన్నారులు ● బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందని పౌష్టికాహారం

జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మెలోకి వెల్లడంతో చాలా చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. ప్రభుత్వ ఆదేశాలు మేరకు మండలంలోని పదిశాతం అంగన్‌వాడీ కేంద్రాలను సచివాలయ ఉద్యోగులు తెరిచినా పిల్లలు, గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు రాకపోవడంతో వెలవెలబోతున్నాయి. తెరిచిన కేంద్రాలను పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా కానరాకపోవడంతో బాలింతలకు, గర్భిణులకు, చిన్నారులకు పౌష్టికాహారం అందడం లేదు. పౌష్టికాహారం అందకపోయినా అంగన్‌వాడీ కార్యకర్తలకే తమ మద్దతు అంటూ గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లిదండ్రులు చెప్పడం కొసమెరుపు..

ప్రజాశక్తి- రేగిడి

మూతపడిన కొమెర అంగన్వాడీ కేంద్రం

మండలంలోని సంకిలి, బూరాడ, ఉనుకూరు సెక్టార్ పరిధి గ్రామాల్లో 85 అంగన్వాడి కేంద్రాలు ఉన్నాయి. ఇందులో సుమారు 75 కేంద్రాలు మూతపడ్డాయి. కేవలం పది కేంద్రాలకు మాత్రమే అధికారులు తాళాలు పగులు గొట్టి తెరిచినప్పటికీ గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో విఫలమవుతున్నారు. పైగా సచివాలయం ఉద్యోగులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఉద్యోగాలు చేస్తే మరి వారికి అప్పగించిన సంగతేంటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి కార్యకర్తల సమస్యలను పరిష్కరించక పోవడం వల్ల సుమారు రెండు వారాలుగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతున్నారు. పైగా అంగన్‌వాడీలు సమ్మెలోకి వెళ్లే ముందు రోజు వరకూ కేంద్రాల్లో నిల్వ ఉన్న సరుకులు కూడా పాడైపోయే పరిస్థితి ఉంది.

తాళాలు వేసి ఉన్న లచ్చరాయపురం కేంద్రం

పిల్లలను ఎవరు తీసుకొస్తారు.?

వాస్తవానికి ప్రతి రోజు అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఉన్న పిల్లలను ఆ కేంద్రానికి సంబంధించిన ఆయా ఇంటింటికి వెళ్లి కేంద్రానికి తీసుకొస్తారు. అయితే అధికారులు పది శాతం కేంద్రాలను తెరిచినప్పటికీ ఇంటింటికీ వెళ్లి పిల్లలను తీసుకురావడంలో విఫలమవుతున్నారు. పైగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలతో పిల్లలకు ఉన్న ముఖ పరిచం సచివాలయ ఉద్యోగులతో లేకపోవడంతో కేంద్రాలకు వెళ్లేందుకు నిరాకరిస్తున్నారు. దీంతో ఉద్యోగులు కూడా నిరాశ చెంది వెనుదిరుగుతున్నారు. కొంత మంది ఉద్యోగులు ప్రభుత్వం ఆదేశించినప్పటికీ పిల్లలు, గర్భిణులు, బాలింతలు రావడం లేదని తాళాలు పగలగొట్టిన కేంద్రాలను కూడా ప్రస్తుతం తెరవలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలను పరిష్కరించి వారిచే కార్యాలయాలు తెరిచేలా చర్యలు తీసుకుంటేనే అంగన్‌వాడీ కేంద్రాలకు పూర్వ వైభవం వస్తుందని లేకపోతే కేంద్రాలు పూర్తిగా మూతపడిపోతాయని పలువురు చెబుతున్నారు. పైగా బాలింతులు, గర్భిణులు, చిన్నారులు కూడా కార్యకర్తలు, ఆయాలు తెరిస్తేనే కేంద్రాలకు వెళతామని, అప్పటి వరకూ కేంద్రాల వైపు కన్నెత్తి కూడా చూడబోమని తెగేసి చెబుతున్నారు.

పౌష్టికాహారం ఎవరిస్తారు?

వేపాడ: మండలంలోని అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ కేంద్రాలకు పూర్తిగా తాళాలు పడటంతో తమకు ఎవరు పౌష్టికాహారం ఇస్తారని గర్భిణులు, బాలింతలు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పారదర్శక పరిపాలన అంటే ఇలాగేనా! అని మండిపడుతున్నారు. రెండు వారాలుగా పౌష్టికాహారం అందకపోవడంతో బాలింతులు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచి పౌష్టికాహారం అందించాలని కోరుతున్నారు.

పౌష్టికాహారం అందడం లేదు

అంగన్వాడీ కార్యకర్తలు సమ్మెలో ఉండడంతో పౌష్టికాహారం అందించడం లేదు. గర్భిణులు, బాలింతలకు మోను పెట్టే నాదుడే లేదు. దీంతో కేంద్రాల వైపు వెల్లడమే మానేశాం.

- పి.జానకి, సంకిలి

సరుకులు ఇవ్వడంలేదు

అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మెలోకి వెళ్లిన తరువాత అధికారులు హడావుడిగా కేంద్రాలను తెరిచారు. తెరిచిన తరువాత కూడా గర్భిణులు, బాలింతలకు సరుకులు ఇవ్వలేదు. కనీసం ఎంపిడిఒ పర్యవేక్షణ కూడా లేకపోవడంతోనే సరుకులు అందలేదు.

- పి. యమున, గర్భిణి, కొమెర

చిన్నారులు ఇంటి వద్దే ఉంటున్నారు..

అంగన్‌వాడీలు సమ్మెలోకి వెళ్లినప్పటి నుంచి చిన్నారులు ఇంటి వద్దే ఉంటున్నారు. వారికి ఆట,పాటలు లేవు. వచ్చిన కొద్దిపాటి రైమ్స్, అక్షరమాల పూర్తిగా మరిచిపోతున్నారు. ప్రభుత్వం స్పందించి వారి సమస్యలను పరిష్కరిస్తే తిరిగి మా పిల్లలను కేంద్రాలకు పంపిస్తాం.

కె. భారతి, లచ్చారాయపురం

ఆదేశాలు అమలు చేశాం.. కానీ

అంగన్వాడి కార్యకర్తలు సమ్మె వల్ల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అంగన్వాడి కేంద్రాలు స్థానిక నాయకులతో సంప్రదించి తాళాలు పగలగొట్టించాం. అంగన్వాడి కేంద్రాలను తెరవమని సచివాలయ మహిళా ఉద్యోగులకు ఆదేశాలిచ్చాం. పూర్తిస్థాయిలో అంగన్వాడీ కేంద్రాలను తెరవాలని ప్రయత్నించినప్పటికీ కొన్నిచోట్ల గ్రామస్తులతో ఘర్షణలు పడ్డాం. పూర్తిగా తెరిచేందుకు ప్రయత్నం చేస్తాం.

శ్యామల కుమారి, ఎంపిడిఒ, రేగిడి.

చెవిలో పూలతో కార్మికుల నిరసన

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు గురువారం వినూత్నంగా చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన సమ్మె మూడోరోజు కొనసాగింది. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామని చెప్పి హామీ ఇచ్చిన అమలు చేయకుండా సీఎం జగన్మోహన్ రెడ్డి చెవిలో పువ్వులు పెట్టారని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు అన్నారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయకపోతే సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గౌరీష్, నాయకులు యుగంధర్, వాసు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: దండాలు మహాప్రభో మా సమస్యలు పరిష్కరించాలని నగర పంచాయతీ కార్మికులు వినూత్న రీతిలో నిరశన వ్యక్తం చేశారు. నగర పంచాయతీ కార్యాలయం వద్ద గత మూడు రోజులుగా మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెలో భాగంగా గురువారం వినూత్న రీతిలో దండాలు పెట్టి అయ్యా మహా ప్రభో సీఎం జగన్ మోహన్ రెడ్డి మీరిచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు మాట్లాడుతూ సిఎం ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు కార్మికులు పోరాటం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి. బాబూరావు, బి. హరిబాబు, జె.శ్రీను, బి. రాము, టి. లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: దండం పెడుతూ నిరసన తెలుపుతున్న కార్మికులు

కార్మికులకు మాజీ మంత్రి సంఘీభావం

రాజాం: మాజీ మంత్రి, రాజాం నియోజకవర్గం టిడిపి ఇన్ఛార్జి కోండ్రు మురళీమోహన్ మున్సిపాలిటీ కార్మికుల సమ్మెకు సంఘీభావం వ్యక్తం చేశారు. జగన్ మూర్ఖత్వానికి అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు, మున్సిపాలిటీ కార్మికుల, సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఉపాధ్యాయులు సమస్యలపై సమ్మెలో పాల్గొన్నా పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో టిడిపి ప్రభుత్వం వస్తుందని సమస్యలు పరిష్కారానికి చంద్రబాబు కృషి చేస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రేగిడి మాజీ జెడ్‌పిటిసి మంతిని ఉషారాణి, జగన్మోహన్‌రావు, గురవాన నారాయణరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం నాటికి 3వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా చెవిలో పూలు పెట్టుకుని విజయనగరం కార్పొరేషన్ కార్యాలయం ముందు కార్మికుల బైఠాయించారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, నెల్లిమర్ల, రామతీర్థం, ముసిడిపల్లి పంప్ హౌస్ కార్మికులకు టర్న్‌కి సిస్టం రద్దు చేసి ఆప్కాస్ జీతాలు చెల్లించాలని, 6 నెలల బకాయిలు ఇవ్వాలని పెద్ద ఎత్తున నినదించారు. మున్సిపల్ కార్యాలయానికి రాకపోకల అడ్డుకోవడంతో స్పందించిన అధికారులు కాంట్రాక్టర్‌తో మాట్లాడి రెండు నెలల జీతాలు తక్షణమే చెల్లించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏ .జగన్మోహన్‌రావు, నాయకులు భాస్కర్ రావు, లక్ష్మణరావు మాట్లాడుతూ థర్డ్ పార్టీ విధానాన్ని రద్దు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి పంప్ హౌస్ కార్మికులను, క్లాప్ వాహన డ్రైవర్లను కాంట్రాక్ట్ విధానంలో ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. గత 22 ఏళ్ల నుంచి విజయనగరం మున్సిపాలిటీకి మంచినీరు అందిస్తున్న కార్మికులకు నెలకు రూ.9వేలు ఇచ్చి శ్రమ దోపిడీ చేస్తున్నారని, అడిగితే 2023 జూన్ నుంచి రూ.2వేలు పెంచారని, జూన్ నెలలో పెరిగిన 2వేలు నేటికీ కార్మికులకి ఇవ్వలేదని గుర్తు చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనకు పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రామచంద్రరావు మద్దతు ప్రకటించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించిన వారిలో నెల్లిమర్ల, రామతీర్థం, ముసిడిపల్లి మాస్టర్ పంప్ హౌస్ కార్మికులతో పాటు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

విజయనగరం: చెవిలో పూలతో నిరసన తెలుపుతున్న కార్మికులు

మాట్లాడుతున్న రాజు, శ్రీనివాసన్

30న మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి- బొబ్బిలి

ఈ నెల 30వ తేదీన మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు, ఎన్‌ఆర్‌ఐ హాస్పిటల్ సిఇఒ ఎస్.శ్రీనివాసన్ తెలిపారు. గురువారం స్థానిక ఎన్‌ఆర్‌ఐ హాస్పిటల్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. అంతర్జాతీయ రోటరీ సంస్థ డిసెంబర్ నెలను వ్యాధుల నివారణ-నిర్ధారణ, చికిత్స అనే విషయంపై వివిధ వైద్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 30వ తేది శనివారం మహారాణి పేటలో గంటి ప్రసాదం స్మారక భవనంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, కార్డియో, ఆర్థో, గైనిక్, పెడియాట్రిక్, డెంటల్, ఆస్తమా, (పల్మా నోలోజి) సంబధిత వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందిస్తారని తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాన్నం 1 గంట వరకు శిబిరం ఉంటుందని శిబిరానికి ఎఐటియుసి బొబ్బిలి పట్టణ శాఖ సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సదావకాశాన్ని కార్మికులు, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

విద్యార్థి దశలోనే సైన్స్ అలవర్చుకోవాలి

ప్రజాశక్తి- దెంకాడ

విద్యార్థి దశలోనే సైన్స్ అలవర్చుకోవాలని ఎంఇఒ రాధాకృష్ణ అన్నారు. విద్యార్థులలో ఆసక్తి పెంచి సైన్సు పట్ల వుచ్చుకత తెచ్చేందుకు జెవివి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తుందన్నారు. జెవివి సమత జిల్లా కన్వీనర్ జి. నిర్మల ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కాలేజిలో గురువారం మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు పేపర్లను విడుదల చేశారు. అనంతరం నిర్వహించిన మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో వివిధ స్కూల్ విద్యార్థులు పాల్గొని తలబడ్డారు. ఇందులో మొదటి స్థానంలో పెద్ద తాడివాడ హైస్కూల్ విద్యార్థులు, రెండవ స్థానంలో రఘుమండ హై స్కూల్ విద్యార్థులు విజయం సాధించి జిల్లా స్థాయి టాలెంట్ టెస్టుకు ఎంపికయ్యారు. వారికి జూనియర్ కాలేజి ప్రిన్స్‌పాల్ చేతుల మీదుగా సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. విద్యార్థులను మండల ఉపాధ్యాయులు, జెవివి నాయకులు అభినందించారు. అంతరం నిర్మలా మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జనవరి 7న విజయనగరం సంస్కృత హైస్కూల్ పోటీలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సూర్యారావు, జెవివి మండల నాయకులు ప్రసాదరావు మాస్టర్, సమతా నాయకులు గౌరీ నిర్మల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశ్నా పత్రాలను విడుదల చేస్తున్న ఎంఇఒ, తదితరులు

ధాన్యం కొనుగోలులో మోసం : టిడిపి

ప్రజాశక్తి-చీపురుపల్లి

ధాన్యం కొనుగోలులో రైతులను మోసంచేస్తున్నారని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కిమిడి నాగార్జున అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన పంట కొనుగోలులో అవకతవకలు చేస్తున్నారన్నారు. ప్రతి క్వింటాకు 5 కేజీలు నుండి 8 కేజీలు వరకు మార్జిన్ తీసుకొని రైతుల పొట్టకొడుతున్నారని ఆవేదన చెందారు. ప్రజలందరూ వైసిపి పాలనలో ఇబ్బందులు పడుతున్నారుని చెప్పారు. టిడిపి ఆధ్వర్యంలో జరుగుతున్న భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో త్వరగా పూర్తి చేయాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు పైల బలరాం, వెన్నె సన్యాసినాయుడు, తిరుమలరాజు కిరణ్ కుమార్ రాజు, తాడ్డే సన్యాసినాయుడు, సారేపాక సురేష్ బాబు, రెడ్డి గోవింద, బలగం వెంకటరావు, మహంతి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నుంచి మిమ్మల్ని మీరే కాపాడుకోవాలి

శృంగవరపుకోట: వైసిపి పెనుభూతం కోరల నుంచి ప్రజలారా మిమ్మల్ని మీరే కాపాడుకోవాలని నియోజకవర్గ టిడిపి ఇంఛార్జ్ కోళ్ల లలిత కుమారి అన్నారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న అన్న క్యాంటిన్ వద్ద గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో అమల్లోకి తెచ్చిన ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు -2022 (ఆంధ్ర ప్రదేశ్ భూమి హక్కుల చట్టం, 2022) ప్రజల పాలిట యమ పాశం కాబోతుందని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల పాటు ప్రజలతో మమేకమై సేవలు చేసిన రిజిస్ట్రేషన్ వ్యవస్థ, రెవెన్యూ వ్యవస్థ, న్యాయవ్యవస్థ ఇక ముందు మూత పడబోతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు మల్లేశ్వరరావు, రాష్ట్ర ఐటిడిపి కార్యదర్శి చక్కా కిరణ్‌కుమార్, నియోజకవర్గ ఐటిడిపి ఇంఛార్జ్ అనకాపల్లి చెల్లయ్య, విశాఖ టిడిపి పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి కాపుగంటి శ్రీనివాసరావు, పట్టణ ఉపాధ్యక్షులు పొట్నూరు అప్పలరాజు (సాయిరాం), పెదగడ రాజు, భీశెట్టి మోహన్ కుమార్, కొత్తవలస మండల తెలుగు యువత అధ్యక్షులు కర్రి చంద్ర శేఖర్ రాజు (చిన్నా), మతల రమణ, తదితరులు పాల్గొన్నారు.

మేట్లకు శిక్షణ

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని గర్భాం, భైరిపురం, చినబంటుపల్లి, ఇప్పలవలస, చెల్లాపురం, నరసయ్యపేట గ్రామాలకు సంబంధించిన మహిళా మేట్లకు గర్భాం సచివాలయంలో ఉపాధి పనులకు సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి సిబ్బంది సతీష్, రామకృష్ణ, బిఎఫ్‌టి ఆశిరయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన కొలతలు ప్రకారం ఉపాధి వేతన దారులకు వంద రోజులు పని కల్పించి అందరికి సమాన వేతనం అందే విధంగా చూడాలని తెలిపారు. గ్రామంలోని వలసలు నివారించటం కోసం వారికి పని కల్పించటం కోసం మహాత్మా గాంధీ గ్రామీన ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో మేట్లకు శిక్షణ ఇస్తున్న అధికారులు

గ్రామ సేవలకు అంకితం : మంత్రి

ప్రజాశక్తి-గుర్ల, చీపురుపల్లి

గ్రామాలలో సచివాలయాల పరిధిలో సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ, ఎవరికి ఏ అవసరం ఉన్నా హాజరవుతూ, ప్రజల సేవలకు అంకితమవుతున్నారని రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. కోటగండ్రేడు గ్రామంలో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనాలను, ఇంటింటికీ కుళాయిలను కూడా ప్రారంభించారు. చీపురుపల్లి మండలం రామలింగాపురం గ్రామంలో పలు భవనాలను ప్రారంభించారు. సుమారు మూడు కోట్ల రూపాయలతో నిర్మించిన 33/11 కెవి సబ్ స్టేషన్ , రూ. 40లక్షల వ్యయంతో నిర్మించిన సొసైటీ గిడ్డంగి, గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్ర భవనం, వైయస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను మంత్రి ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించి, అహ్లాదకర మైన వాతావరణంలో విద్యాబోధన అందిస్తున్నామన్నారు. కార్యక్రమాల్లో జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ కలెక్టర్ నాగలక్ష్మి ,ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎంఎల్‌సి డాక్టర్ పి.సురేష్‌బాబు, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఆర్‌డిఒ బి.శాంతకుమారి, జెడ్‌పి సిఇఒ కె.రాజ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి తారకరామారావు, మండల స్పెషల్ ఆఫీసర్ ఉమాశంకర్, ఎంపిపి ప్రమీల, ఎంపిడిఒ కల్యాణి, తహశీల్దార్ పద్మావతి, డిసిసిబి ఛైర్మన్ వేచలాపు చిన రామనాయుడు, ఎంపిపి ఇప్పిలి వెంకట నరసమ్మ, జడ్పిటిసి వలిరెడ్డి శిరీష, అనంత్, వలిరెడ్డి శ్రీనివాస్ నాయుడు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

గుర్ల : మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు

ప్రజాశక్తి- బాడంగి

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలను అందిస్తున్నామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. మండలంలోని డొంకినవలసలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, హెల్త్ క్లినిక్ సెంటర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో మాదిరిగా మండల కేంద్రాలకు తిరిగే పనిలేకుండా తమ గ్రామంలోనే ప్రభుత్వం అందించే అనేక రకాల సేవలు వినియోగించుకునేలా ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ రూపొందించిందన్నారు. సచివాలయ ఉద్యోగులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రజల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పై పెరుగుతున్న ఆదరణ చూసి ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, డిఇ అప్పారావు, వైసిపి నాయకులు తెంటు మధుసూదన్, మండల కన్వీనర్ బి వెంకట్ నాయుడు, జెసిఎస్ కన్వీనర్ మరిపి శంకర్ రావు, సర్పంచులు, ఎంపిటిసిలు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

వన్‌టౌన్ స్టేషన్ పరిశీలన

ప్రజాశక్తి- విజయనగరం

వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్‌పి ఎం.దీపిక గురువారం విజయనగరం వన్ టౌన్ పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. పోలీసు స్టేషన్ ప్రాంగణం, ప్రాపర్టీ రూం, స్టేషన్ రికార్డులు, సిడి ఫైల్స్ తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా దర్యాప్తులో ఉన్న కేసుల సంఖ్యను గణనీయంగా తగ్గించినందుకు అధికారులను అభినందించారు. స్టేషను సిబ్బందికి దత్తత ఇచ్చిన వార్డుల్లో సమస్యలు సృష్టించే వారిని గుర్తించాలని, బైండోవర్ కేసులు పెట్టాలని, ఎన్‌ఫోర్సుమెంట్ కేసులు, ఎక్సైజ్ కేసులు పెంచాలని ఆదేశించారు. అనంతరం, పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న యువతకు స్టడీ మెటీరియల్ అందించారు. డిఎస్‌పి ఆర్.గోవిందరావు, వన్ టౌన్ సిఐ బి.వెంకటరావు, సిసిఎస్ సిఐ సత్యనారాయణ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.